సాక్షి పల్నాడు

గురువారం । 29 । జూన్ । 2023



బండ్లమ్మ హుండీ ఆదాయం

పిట్టలవానిపాలెం : బాపట్ల జిల్లా చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మ ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. రూ.3,74,858 ఆదాయం లభించినట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు.



మల్లేశ్వర స్వామి ఆదాయం

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వర స్వామి గుడిలో బుధవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 90 రోజుల్లో రూ.50,92,440 నగదు, 23.900 మిల్లీ గ్రాముల బంగారం వచ్చింది.



విజయకీలాద్రిపై విదేశీయులు

తాడేపల్లిరూరల్ : విజయకీలాద్రి దేవస్థానాన్ని బుధవారం రష్యా, ఉక్రెయిన్‌కు చెందిన భక్తులు దర్శించుకున్నారు. వారంతా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

తొలి ఏకాదశికి ముస్తాబైన కోటప్పకొండ




నరసరావుపేట రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతిస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా మూలవిరాట్ అభిషేకాలు రద్దు చేశారు. ఉచిత దర్శనంతోపాటు ప్రత్యేక, శీఘ్ర, అభిషేక దర్శనం కోసం క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి యాత్రికులను కొండకు చేరవేసేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో వై.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

30న ముగియనున్న సీపెట్, పీజీ డిప్లొమాకు దరఖాస్తు

గుంటూరు ఎడ్యుకేషన్ : విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో 2023–24 విద్యా సంవత్సరానికి డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసేందుకు తుది గడువు ఈనెల 30న ముగియనుందని సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశానికి టెన్త్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. అదే విధంగా రెండేళ్ల వ్యవధి గల పీజీ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) కోర్సుకు బీఎస్సీలో ఉత్తీర్ణులైన వారితో పాటు ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులకు ఫీజు రీ–యింబర్స్‌మెంట్ సదుపాయం వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ వసతి కలదన్నారు. ఆయా కోర్సుల్లో చేరాలనే ఆసక్తి గల విద్యార్థులు ఇతర సమాచారం కోసం తమ ప్రతినిధి అంజి నాయక్‌ను 78935 86494 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

డీసీఈబీ చైర్‌పర్సన్‌గా డీఈవో శైలజ



గుంటూరు ఎడ్యుకేషన్ : జిల్లా ఉమ్మడి పరీక్ష మండలి (డీసీఈబీ) చైర్‌పర్సన్‌గా డీఈఓ పి.శైలజ ఎన్నికయ్యారు. బుధవారం పాతబస్టాండ్ సెంటర్లోని డీసీఈబీ కార్యాలయంలో మూడేళ్ల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డీసీఈబీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న డీఈఓ శైలజ తిరిగి అదే పదవిలో నియమితులయ్యారు. కాగా ఇప్పటి వరకు కార్యదర్శిగా కొనసాగిన కృష్ణానాయక్ స్థానంలో బుద్దిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోపిశెట్టి లలిత ప్రసాద్, వైస్ చైర్మన్లుగా గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు, తెనాలి డీవైఈఓ ఎస్.నిర్మల, ప్రభుత్వ పరీక్షల విభాగ సహాయ కమిషనర్ కె.వెంకటరెడ్డితో పాటు మరో ఎనిమిది మంది హెచ్‌ఎంలు సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ హెచ్‌ఎం ఆవుల తిరుమలేష్, కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 519.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.60 అడుగుల వద్ద ఉంది.

యార్డుకు 35,566 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు) : గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 35,566 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 34,660 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9 వేల నుంచి రూ.23 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9 వేల నుంచి రూ.25,600 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.10 వేల నుంచి 22,500 వరకు ధర లభించింది.

పులకించె 'అమ్మఒడి'

- అట్టహాసంగా నగదు జమ
- జిల్లాలో 1,87,417 మందికి ప్రయోజనం
- రూ.243.64 కోట్ల మేర లబ్ధి
- విద్యార్థుల ఆనందోత్సాహాలు
- మురిసిన తల్లిదండ్రులు

బుడి'బడి' అడుగుల సవ్వడికి తోడు సంక్షేమ సిరులు కలగలిసి గలగలా నవ్వులు కురిపించాయి. 'అమ్మఒడి'లో ఆనందాలై పులకించాయి. పేదల హితమే 'మా మ'తమని నినదించాయి. 'విద్య'యోస్తు అంటూ చిన్నారులను దీవించాయి. జగనన్న అమ్మఒడి పథకంలో భాగంగా వరుసగా నాలుగో ఏడాదీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం బటన్ నొక్కి నగదు జమ చేశారు. ఫలితంగా జిల్లావ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి.

నరసరావుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులను తీసుకువచ్చి అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నారని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ప్రాంతంలో నిర్వహించిన అమ్మఒడి నాలుగో విడత నగదు జమ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి శాసనమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు పల్నాడు జిల్లాలో విద్య, ఉపాధి అవకాశాలు పుష్కలంగా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. అమ్మఒడి సాయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా అమ్మఒడి ద్వారా నాలుగు విడతల్లో సుమారు రూ.26 వేల కోట్లను అందించడం ఒక చరిత్ర అన్నారు. జిల్లాలో 1,87,417 మంది తల్లుల ఖాతాల్లో రూ.243.64 కోట్ల మేర నగదు జమైనట్టు వివరించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందించారు. కార్యక్రమంలో డీఈఓ కె.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మఒడి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్సీ జంగా

సంతోషంగా ఉంది



జగన్ మామ నాలుగోసారి నాకు డబ్బులు విడుదల చేయటం చాలా సంతోషంగా ఉంది. ఎలాంటి ఇబ్బందీ లేకుండా బాగా చదువుకుంటున్నా. టీచర్లు అందరూ బాగా చెబుతున్నారు. ట్యాబ్ కూడా ఇచ్చారు.

– తల్లి కట్టా కమలకుమారితో అఖిల, ఎస్‌బీపురం జెడ్పీహైస్కూలు, తొమ్మిదో తరగతి, ఇక్కుర్రు, నరసరావుపేట మండలం

జగన్ మామకు కృతజ్ఞతలు



జగన్ మామ డబ్బులీయటం వల్ల నా చదువు ఎటువంటి ఆటంకం లేకుండా సాఫీగా సాగిపోతోంది. నా తల్లితండ్రులకు మేము ఐదుగురు పిల్లలం. నాకే అమ్మఒడి వస్తోంది. బాగా చదువుకుంటున్నా. జగన్ మామకు కృతజ్ఞతలు.

– తల్లి ఎలీశా కుమారితో నెహేమియా మనోహర్, 7వ తరగతి, శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలు, నరసరావుపేట

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ప్రతిపాదనలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు–2023 కోసం జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు సంబంధిత ఎంఈవో, డీవైఈవోల ద్వారా ప్రతిపాదనలు పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ప్రతిపాదనలను జూలై 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో http://nationalawardstoteacherseducation.gov.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలని సూచించారు.

నేను ప్రజల మనిషిని

- మాది మూడు దశాబ్దాల రాజకీయ చరిత్ర
- మా మీద అక్రమ కేసులు పెట్టి పీకిందేం లేదు
- అమ్ముడుపోయే అవసరం మాకు లేదు
- దుష్ప్రచారం మా బతుకు కాదు
- మూసుకునే పార్టీకి అంత బిల్డప్ ఎందుకు
- తెలుగుదేశం పార్టీపై ప్రభుత్వ విప్ పీఆర్కే ధ్వజం



మాచర్ల : ఉనికి కోల్పోయి అధికారంలోకి వచ్చే భవిష్యత్తే లేని తెలుగుదేశం పార్టీ నేతలు ప్రజలను ఏదో విధంగా నమ్మించాలనే ఉద్దేశంతో 'మీ భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ యాత్ర నిర్వహించటం హాస్యాస్పదంగా ఉందని, ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మాచర్లలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముందు టీడీపీ నేతలు వారి భవిష్యత్తు చూసుకోవాలని హితవు పలికారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

పార్టీలు మారిన చరిత్ర మాది కాదు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డీ.. ముందు నీకు టికెట్టు వస్తుందో లేదో చూసుకో. మూడు దశాబ్దాలుగా మా కుటుంబం రాజకీయాలలో ఉంది. మాకు పార్టీలు మారిన చరిత్ర లేదు. ఫ్యాక్షన్ చరిత్ర అంతకన్నా లేదు. గతంలో అక్రమ కేసులలో మమ్మల్ని ఇరికించి ఏం పీకారు? మీరు అధికారంలో ఉన్నప్పుడు అనేక ఆరోపణలు చేశారు. నేను ఆనాడే చెప్పాను. యరపతినేని, జీవీ, బ్రహ్మారెడ్డి.. నేనేంటో మా ప్రజలే చెబుతారన్నాను. నాపై అక్రమ కేసులు పెట్టినా.. నేను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచా. నాలుగు బైపాస్ రోడ్లు వేశా. చంద్రబాబు 40 ఏళ్ళ పాలన అని చెప్పుకొని మాచర్ల నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. అభివృద్ధి అంటే ఏంటో కూడా చెప్పలేరు.

వరికపూడిసెల సీఎం వైఎస్ జగన్ పుణ్యమే

చంద్రబాబూ నువ్వు వరికపూడిసెల నా వల్ల కాదంటూ రెండుసార్లు శంకుస్థాపన చేసి ప్రజలను మోసం చేశావు. అందుకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరికపూడిసెలకు కేంద్ర ప్రభుత్వ అనుమతులన్నీ తీసుకొచ్చి ఏడు దశాబ్దాల రైతుల కల నిజం చేయబోతున్నారు. ఇది ఆయన పుణ్యమే. ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. వైఎస్సార్, సీఎం జగన్ పల్నాటి ప్రజలకు మేలు చేశారు. కొప్పునూరు అనుపు లిఫ్ట్ ఇరిగేషన్‌తో మేలు చేశాం. వేలాది మంది పేద ప్రజలకు 30 వేల ఇళ్ళ పట్టాలను ఇచ్చాం. వైఎస్సార్ జలకళ ద్వారా 500 బోర్లను ఏర్పాటు చేశాం.

సెకండ్ పార్టు చూపిస్తా

హద్దు మీరి మాట్లాడితే రెండో సినిమా చూపిస్తా. సెకండ్ పార్టు ఎలా ఉంటుందో రుచి చూపిస్తా.. దమ్ముంటే నేను అక్రమాలు చేశానని రుజువు చేయండి. రోడ్డు షో పేరుతో నా తమ్ముడి బార్ ముందు ఈలలు వేసి టపాసులు కాలిస్తే మొనగాళ్ళు కాలేరు. ఎక్కువ మాట్లాడితే పార్టుల వారీగా బాల్కనీ, బెంచీలలో కూర్చోపెట్టి షోలు చూపిస్తా. బ్రహ్మారెడ్డి వారాలబ్బాయిగా, పెయిడ్ ఆర్టిస్టుగా వ్యవహరించి ఇదే తమ పార్టీ బలమనుకుంటే నాకేం నష్టం లేదు. నేనెప్పుడూ ప్రజల్లోనే ఉన్నా.. ఉంటా. అని పిన్నెల్లి పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, 80 ఏళ్ళు వచ్చిన చంద్రబాబు ఉనికి కోల్పోయి టీడీపీని మూత వేసుకోవాల్సిందేనని, ఇప్పుడు అంత బిల్డప్ పనికిరాదని పీఆర్కే స్పష్టం చేశారు. టీడీపీ, ఎల్లో మీడియా చేసే దుష్ప్రచారాలను ప్రజాభిమానంతోనే తిప్పికొడతామని ధీమా వ్యక్తం చేశారు.

ఫ్యాక్షన్ చరిత్ర మీది

జన్మభూమి కమిటీలతో దోపిడీకి పాల్పడిన టీడీపీ నేతలను ప్రజలు దూరం పెట్టారు. మా నియోజకవర్గంపై కక్షగట్టి బ్రహ్మారెడ్డి ద్వారా చంద్రబాబు ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరతీశారు. మా తమ్ముడు 20ఏళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్నాడు. అది అక్రమం కాదు. మా దగ్గర గ్రానైట్ క్వారీలు లేవు. యరపతినేని అధికారంలో ఉన్నప్పుడు రూ.వేల కోట్లతో అక్రమ మైనింగ్ కేసులో ఇరుక్కున్నాడు. రోడ్లపై వెళ్ళే గ్రానైట్ లారీలతో నాకేం సంబంధం.

నీతి, న్యాయం హుష్‌ఖాకీ

పోలీసుల అవినీతి దందా

- ఎస్‌ఐల నుంచే ఓ సీఐ నెలవారీ వసూళ్లు
- రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో ట్రాఫిక్ ఎస్‌ఐ
- పెట్టుబడి పెట్టి మరీ బ్లాక్ టిక్కెట్లు అమ్మిస్తున్న కానిస్టేబుల్
- జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కాసుల కోసం కక్కుర్తి పడి కొందరు పోలీసు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఆ శాఖను అప్రతిష్టపాలు చేస్తోంది. నీతి వాక్యాలు వల్లిస్తూ.. స్టేషన్లలోని ఎస్‌ఐల వద్దే నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్న ఓ సీఐ.. నిబంధనలకు విరుద్ధంగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ఒక ట్రాఫిక్ ఎస్‌ఐ.. పెట్టుబడి పెట్టి మరీ కొత్త సినిమాల టికెట్లు బ్లాక్‌లో అమ్మిస్తున్న కానిస్టేబుల్.. ఎస్‌ఐ స్థాయి వ్యక్తులకు ఇండెట్లు ఇస్తున్న జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్నతాధికారి వ్యక్తిగత వ్యవహారాలు చూస్తే వ్యక్తి.. పోలీసు శాఖ గౌరవాన్ని మసకబారుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కిందస్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడిందనే వాదన వ్యక్తమవుతోంది.

'కలెక్షన్' ఇన్‌స్పెక్టర్

గుంటూరు ఈస్ట్ పరిధిలోని ఒక విభాగానికి చెందిన సీఐ (సర్కిల్ ఇన్‌స్పెక్టర్) కలెక్షన్ ఇన్‌స్పెక్టర్‌గా మారారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ స్టేషన్ పరిధిలోని ఎస్‌ఐల వద్దే నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారని సమాచారం. ప్రతి నెలా ఒక్కో ఎస్‌ఐ తనకు రూ 10 వేలు ఇవ్వాల్సిందేనంటూ హుకుం జారీ చేయటంతో ఆయన పరిధిలోని నలుగురు ఎస్‌ఐలు ప్రతినెలా రూ.40 వేలు ముట్టచెబుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. రిటైర్మెంట్ దగ్గర్లో ఉన్న ఒక ఎస్‌ఐ తాను ఇవ్వలేనని చెప్పినా.. ఆ సీఐ వినకుండా వేధింపులకు గురి చేసి మరీ తీసుకుంటున్నారన్న చర్చ పోలీసు వర్గాల్లో జరుగుతోంది. అయితే నిత్యం ఆ సీఐ నీతి వాక్యాలు వల్లిస్తుంటారని.. ఇటీవల నెలవారీ మామూలు పెంచలేదనే ఉద్దేశంతో ఓ ఆటో స్టాండ్‌ను తొలగించాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని సమాచారం. ఆ స్టేషన్ రైటర్, కంప్యూటర్ ఆపరేటర్‌ను అడ్డుపెట్టుకుని ప్రతి కేసులో చేతివాటం ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది.

ఎస్‌ఐ 'రియల్' దందా



గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న ఒక ఎస్‌ఐ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బిజీగా మారారని సమాచారం. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఇతరత్రా కార్యకలాపాలు చేయకూడదని స్పష్టమైన నిబంధనలు ఉన్నా.. ఆయన పలువురు హోంగార్డులను బినామీలుగా పెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఈయన గతంలో ట్రాఫిక్‌లో పనిచేసిన ఓ హోం గార్డును అడ్డుపెట్టుకుని ఉన్నతాధికారుల నుంచి అనుమతులు ఇప్పిస్తానని చెప్పి లారీల యజమానుల వద్ద ఉదయం సమయంలో తిరిగేందుకు భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం.

వసూళ్లు చూస్తే మైండ్'బ్లాక్'

సినిమా హాళ్లు, లాడ్జిలు అధికంగా ఉన్న ఈస్ట్ సబ్ డివిజన్‌లోని ఒక స్టేషన్ పరిధిలో ముగ్గురు సీఐలు విధులు నిర్వర్తిస్తున్నారు. సీఐల విషయం పక్కన బెడితే.. స్టేషన్ పరిధిలోని ముగ్గురు డ్రైవర్ల అవినీతికి అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. టిఫిన్ బండ్ల దగ్గర నుంచి లాడ్జిల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ కానిస్టేబుల్ పెట్టుబడి పెట్టి మరీ కొత్త సినిమాల టికెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నాడని సమాచారం. వీటితోపాటు సింగిల్ నంబరు లాటరీ, మూడు బొమ్మల ఆట ఆడించేవారి వద్ద కూడా వసూళ్లకు పాల్పడుతున్నాడని తెలుస్తోంది. కొద్దికాలం క్రితం స్టేషన్ పరిధిలో దొరికిన గంజాయి విక్రేత నుంచి భారీ ఎత్తున నగదు తీసుకున్నట్లు సమాచారం. మరో డ్రైవర్ ఒక పెట్రోల్ బంకు నిర్వాహకుడిని నెలకు ఏకంగా 60 లీటర్ల పెట్రోల్ ఇవ్వాలంటూ వేధింపులకు గురి చేస్తున్నాడని తెలుస్తోంది.



షరా'మామూలే' అన్నట్టు!

గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌కు అతి సమీపంలోని ఒక స్టేషన్ పరిధిలో కొంత మంది ఎస్‌ఐలు వ్యవహరిస్తున్న తీరు అనేక విమర్శలకు తావిస్తోంది. నేరుగా ఒక ఎస్‌ఐ రేషన్ బియ్యం సరఫరా చేసుకునే వారికి అనుమతినిచ్చి కాసులతో జేబులు నింపుకుంటున్నారు. ఒక ఎస్‌ఐ మాత్రం సింగిల్ నంబర్ లాటరీ ఆడించే వారికి అండగా నిలిచి నెలావారీ మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లా పోలీస్ బాస్ ఆఫీస్ నుంచే..



జిల్లా పోలీసు కార్యాలయంలో ఓ ఉన్నతాధికారి వ్యక్తిగత వ్యవహారాలు చూసే ఓ అధికారి ఎస్‌ఐలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. వారికి ఇండెంట్లు ఇవ్వడంతోపాటు, మెమోలు జారీ అయిన సమయంలో వివరణలు ఇచ్చేందుకు రూ.25 వేల నుంచి రూ. 40 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ఆ అధికారి తీరుపై ఎస్‌ఐలు విసిగిపోయినట్టు చర్చ జరుగుతోంది. గతంలోనూ అవినీతి ఆరోపణల నేపథ్యంలో గుంటూరు రేంజ్ అధికారి వద్ద పనిచేస్తూ సస్పెండ్ అయిన ఈ అధికారి జిల్లా పోలీసు కార్యాలయంలో హవా సాగిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవినీతికి పాల్పడితే చర్యలు



పోలీసుశాఖలో కొంత మంది అధికారుల అవినీతి ఏ రూపంలో ఉన్నా సహించం. సత్వర, పారదర్శక, జవాబుదారీతనంతో పని చేయాలే తప్ప.. అక్రమ వసూళ్లకు పాల్పడితే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఖచ్చితంగా విచారణ జరిపిస్తాం. ఎవరైనా అధికారులు డబ్బులు అడిగితే 14400 ప్రభుత్వ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి గానీ, లేకుంటే నేరుగా నన్ను కలిసి గానీ ఫిర్యాదు చేయవచ్చు.

– జి.పాలరాజు, ఐజీ, గుంటూరు రేంజ్

గిరిజనులకు హక్కుపత్రాలు



శివాపురంతండాలో గిరిజనులకు అటవీ భూముల హక్కుపత్రాలు అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అటవీహక్కుల చట్టం అమలులోకి తెచ్చి గిరిజనులకు హక్కుపత్రాలు అందించామని, మళ్లీ ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి అటవీ హక్కుపత్రాలను పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. శివాపురం తండాలోని గిరిజనులకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి నేతృత్వంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ శివాపురం తండాలో గతంలో 128 మందికి 350 ఎకరాలకు హక్కుపత్రాలు మంజూరు చేయగా నేడు 48 మందికి 108 ఎకరాలకు హక్కుపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన వారికి ప్రభుత్వం ఇచ్చే ప్రయోజనాలు, రాయితీలు లభిస్తాయని పేర్కొన్నారు. భూమిని వారసత్వంగా సాగుచేసుకోవచ్చని పేర్కొన్నారు. అమ్మడానికి హక్కు ఉండదని వివరించారు. నియోజకవర్గంలో 579 మందికి 1,006 ఎకరాలకు హక్కుపత్రాలు మంజూరు చేశామన్నారు. నకరికల్లు నుంచి తండా వరకు రోడ్డు వేసేందుకు అటవీశాఖ అధికారులతో మాట్లాడామని, త్వరలోనే చర్యలు చేపడతామని చెప్పారు. శ్మశాన వాటికకు కావలసిన భూమికి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం గుండ్లపల్లిలో మరో 15మందికి హక్కుపత్రాలు పంపిణీ చేశారు. గిరిజనులతో అంబటి మాట్లాడారు. సంక్షేమ పథకాలతో అందరం సంతోషంగా ఉన్నామని వారు మంత్రికి విన్నవించారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పట్టాలు జీవితాలకు భరోసానిస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ బాలూనాయక్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ దుర్గాబాయి, ఆర్డీఓ బి.ఎల్.ఎన్.రాజకుమారి, సర్పంచ్ ధ్వాళీబాయి, ఎంపీపీ మేచారపు అనురాధ, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీబాషా, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పచ్చి అబద్ధాలకోరు యరపతినేని

- దోచుకోవటమే తెలిసింది..
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాసు ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలో యరపతినేని శ్రీనివాసరావు దోచుకోవటం తప్పా చేసింది ఏమీ లేదని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. గతంలో చేసిన పనులను గొప్పలు చెప్పుకోటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. గురజాలలో హాస్పిటల్, మాచవరంలో పబ్లిక్ హెల్త్ సెంటర్ యరపతినేని కట్టించాడని చెప్పుకోవటంపై విస్మయం వ్యక్తం చేశారు. గురజాల, దాచేపల్లి మున్సిపాలిటీలు కావటం కోసం ప్రతిపాదన పెట్టామని అబద్ధాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితో దాచేపల్లి, గురజాల మున్సిపాలిటీలుగా చేశారని మీకు అనుకూల పత్రికల్లోనే వార్తలు వచ్చాయని ఆ క్లిప్పింగ్‌లను ఈ సందర్భంగా విలేకరులకు చూపించారు. యరపతినేనికి డిగ్రీ కళాశాల, మెడికల్ కళాశాలకు తేడా తెలియలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. బ్రాహ్మణపల్లి వద్ద 300 పడకల వైద్యశాల, పిడుగురాళ్ల బైపాస్ రోడ్డు, జానపాడు రోడ్డులోని ఆర్‌ఓబీ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం, వాటిపైనే మిమ్మలను నడిపించి చూపిస్తామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. 2024లో మళ్లీ వైఎస్సార్ సీపీ బ్రహ్మాండమైన మెజార్టీతో గెలవబోతుందని చెప్పారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పార్టీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, కౌన్సిలర్లు పసుపులేటి ఆనంద్, కత్తెరపు వాసుదేవరెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షులు మందా సుధీర్, గొట్టిముక్కల పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

జంపని చక్కెరకు 'టీడీపీ' చేదుగుళిక!

సహకార చక్కెర ఫ్యాక్టరీ మూత

- అంతా టీడీపీ నిర్వాకం వల్లే..
- ఏనాడూ రూపాయి ఆర్థికసాయం చేయని చంద్రబాబు
- పైగా రెండుసార్లు అమ్మేశారు
- రాజన్న చొరవ, కార్మికుల పోరాటంతో తిరిగి 'సహకారం'లోకి..
- అయినా అసమర్థతతో మూసివేత
- ఉద్యోగులకు జీతాలూ చెల్లించని నాటి పాలకులు
- బకాయిలు చెల్లింపు, వీఆర్ఎస్‌కు జీఓ ఇచ్చిన జగన్ ప్రభుత్వం

పదిమందికి ఉపాధినిచ్చే కర్మాగారానికి ఏ ప్రభుత్వమైనా ఊతమై నిలబడాలి. వెన్నుదన్నుగా ఉండి కంటికి రెప్పలా కాపాడుకోవాలి. కానీ నాటి చంద్రబాబు ప్రభుత్వం తీరు వేరు. డెల్టా ప్రాంతానికి ఎంతో పేరుప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన జంపని చెక్కర కర్మాగారానికి చంద్రబాబు వేసిన చేదుగుళికలు ఇవాళ ఆ ఫ్యాక్టరీకి తాళాలు వేసే స్థితికి తీసుకెళ్లింది. తరువాత పగ్గాలు చేపట్టిన రాజన్న ప్రభుత్వం ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు ఎంతో 'సహకారం' ఇచ్చినా నిలబడలేకపోయింది. ఇక చేసేది లేక.. ఇన్నాళ్లు సంస్థనే నమ్ముకున్న ఉద్యోగుల బకాయిలు చెల్లింపు, పదవీ విరమణలు కల్పించి కుటుంబాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు జగనన్న ప్రభుత్వం ముందుకు వచ్చింది.



జంపని చక్కెర ఫ్యాక్టరీ (ఫైల్)

తెనాలి: సహకార ఉద్యమకారుల కలగా రూపుదాల్చిన జంపనిలోని సహకార చక్కెర ఫ్యాక్టరీ టీడీపీ నిర్వాకంతోనే మూతపడింది. నష్టాల్లో ఉన్న ఫ్యాక్టరీని ఆదుకునేందుకు ఏనాడూ ఆర్థికసాయం చేయని టీడీపీ పాలకులు, రెండుసార్లు ఫ్యాక్టరీని 'ప్రైవేటు'కు కట్టబెట్టారు. కార్మికుల పోరాటం, నాటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రోత్సాహంతో ఉన్నత న్యాయస్థానాల్లో గెలిచి తిరిగి సహకార రంగంలోకి తీసుకొచ్చినా ప్రయోజనం లేకపోయింది. టీడీపీ హయాంలో మూతపడింది. పునరుద్ధరణ ప్రయత్నం చేయకపోగా ఉద్యోగుల జీతాలనూ చెల్లించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఉద్యోగులకు జీతాల బకాయిల చెల్లింపు, సర్వీసు ఉన్నవారికి వీఆర్ఎస్‌కు నిర్ణయించి ఆ ప్రకారం జీఓ ఇచ్చింది. నేడో రేపో నిధులు విడుదల చేయనుంది.

తెనాలి సమీపంలోని ప్రస్తుత బాపట్ల జిల్లా పరిధిలో నిస్తేజంగా మిగిలిపోయిన జంపని చక్కెర ఫ్యాక్టరీకి 1974లో శంకుస్థాపన జరిగినా 1984 ఫిబ్రవరిలో క్రషింగ్ ప్రారంభించారు. కాలికి బలపం కట్టుకుని ప్రజల్నుంచి షేరుధనం వసూలు చేసి ఫ్యాక్టరీని నిర్మించింది నాటి కాంగ్రెస్ నేతలు అయినప్పటికీ, ఫ్యాక్టరీ మొదలైన కొన్నేళ్లలోనే టీడీపీ ఆధిపత్యంలోకి వెళ్లింది. 2012లో మూత పడేంతవరకు కేవలం మూడు సీజన్లలోనే సామర్థ్యానికి సరిపడా రూ.1.60 లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయగలిగింది. చెరకు విస్తీర్ణాన్ని తగినంత పెంచటంలో టీడీపీ పాలకవర్గాలు విఫలమయ్యాయి. చెరకు నరికే కూలీల లభ్యత కొరత, కొత మిషనరీ లేమి, ఉద్యోగుల వేతనాలు, కెమికల్స్ ధరలు పెరుగుదల, చక్కెర ధరల్లో ఎదుగూ బొదుగూ లేకపోవటం వంటి కారణాలూ తోడయ్యాయి.

ఈ నేపథ్యంలో 2002-03లో నాటి టీడీపీ ప్రభుత్వం సహకార చక్కెర ఫ్యాక్టరీలను దశల వారీగా ప్రైవేటుపరం చేయసాగింది. అదే ఏడాది జంపని ఫ్యాక్టరీని జయపూర్ షుగర్స్‌కు అప్పగించారు. ఎందుకనో వారు తమకు వద్దని వెనక్కు వెళ్లారు. దీనితో క్రైబ్స్ బయోకెమికల్స్‌కు విక్రయించారు. కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చేసినా ఫలితం లేకుండాపోయింది. 2004 డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తిరిగి 'సహకారం'లోకి తీసుకొచ్చేందుకు చొరవ చూపారు. ఉన్నత న్యాయస్థానాల్లోనూ అనుకూలంగా ఉత్తర్వులు రావటంతో 2004 డిసెంబరులో సహకారం రంగంలోకి వచ్చింది.

మూడు నాలుగేళ్లు బాగానే నడిచినా, 2008-09, 2009-10, 2020-11 సీజన్లలో ఫ్యాక్టరీ మూతపడింది. ఫ్యాక్టరీని తెరిపించేందుకు నాటి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మోపదేవి వెంకట రమణారావు రూ.5.08 కోట్ల రుణం మంజూరు చేయించారు. సకాలంలో అవి అందకుండా చేయటంలో చంద్రబాబు అనుకూలుడైన ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పారన్న ఆరోపణలున్నాయి. నిధుల జాప్యంతో రైతులతో అగ్రిమెంట్లు చేసుకోలేకపోయారు. అధిక మొత్తం చెరకు కృష్ణా జిల్లాలోని ప్రైవేటు ఫ్యాక్టరీకి తరలిపోయింది. 2012 సీజనులో కేవలం 15 టన్నుల చెరకు మాత్రమే క్రషింగ్ చేయగలిగారు.

ఫ్యాక్టరీ మూతతో ఉద్యోగులు రోడ్డున పడ్డారు. వారికి ఏళ్లతరబడి జీతాలు లేవు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక, చక్కెర ఫ్యాక్టరీలపై నిపుణుల కమిటీ, ఆ నివేదికపై ముగ్గురు మంత్రుల కమిటీని నియమించారు. ఆ ప్రకారం జంపనితో సహా ఆరు ఫ్యాక్టరీలు నడిచే అవకాశం లేనందున 2013 జులై నుంచి ఏప్రిల్ 2022 వరకు కటాఫ్ తేదీ నిర్ణయించి రిటైరైన ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, సర్వీసు కలిగినవారికి వీఆర్ఎస్ ఇవ్వటం, పీఎఫ్‌తో సహా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు మొత్తం రూ.108.32 కోట్లు ఇచ్చేందుకని గతేడాది మార్చి 16న జీఓ విడుదల చేశారు. ఆ మొత్తంలో జంపని ఫ్యాక్టరీకి రూ.14.07 కోట్లు రావల్సి ఉంది. కొద్దిరోజుల్లోనే విడుదల చేస్తారన్న నమ్మకంతో ఉద్యోగులున్నారు.

ముఖ్యమంత్రి నిర్ణయం చారిత్రాత్మకం



జంపని సహా మూతపడిన ఆరు చక్కెర ఫ్యాక్టరీల ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్‌లో పెట్టి జీవో ఇచ్చి కార్మికులకు ఒక సెటిల్‌మెంట్ ఇచ్చారు. ఎప్పుడో రిటైరైన కార్మికులకు రావల్సిన బకాయిలు, సర్వీసు ఉన్నవారికి వీఆర్ఎస్‌తో సహా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వటం గొప్ప విషయం, అతి త్వరలోనే నిధులు విడుదల చేస్తారని ఎంతో నమ్మకంతో ఎదురుచూస్తున్నాం. వీఆర్ఎస్ అమలు చేసినందుకు ముఖ్యమంత్రి జగన్‌కు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునకు ధన్యవాదాలు.

–ఎం.బసివి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏపీ స్టేట్ చక్కెర ఫ్యాక్టరీ ఉద్యోగుల సంఘం

చిరుధాన్యాలను రైతులు సాగు చేయాలి

పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి మురళి



వంద శాతం రాయితీ విత్తనాలు పంపిణీ మురళి

సత్తెనపల్లి: రైతులందరూ చిరు ధాన్యాలు అయిన రాగులు, కొర్రలు, సామలు, వరిగలు సాగు చేసుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి కోరారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద చిరు ధాన్యాలు సాగు, కంది పంట సాగు విస్తీర్ణం పెంపుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలో పండేటు వంటి మంచి పోషక విలువలు కలిగిన చిరు ధాన్యాలను ప్రతి ఒక్క రైతు కొంత విస్తీర్ణంలో అయిన సాగు చేసి వారి కుటుంబ అవసరాలకు, తోటి రైతులకు అందించాలని సూచించారు. పత్తి పంటలో మిశ్రమ పంటగా లేదా పత్తి పంట చుట్టూ కంచె పంటగా కందిని సాగు చేసుకోవాలని వివరించారు. దీని మూలంగా ప్రధాన పంటతో పాటుగా అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. 100 శాతం రాయితీ పై కంది ఎల్ఆర్‌జీ -52 రకం విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. రాగులు 100 శాతం రాయితీ పై 5 ఎకరాల సాగుకై మినీ కిట్ రూపంలో అందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రవి కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు(ఇన్‌చార్జి)ఎస్. శ్రీధర్ రెడ్డి పంచాయతీ సెక్రటరీ జి.శ్రీనివాస్, గ్రామ సర్పంచి కుంభా లక్ష్మి, ఎంపీటీసీ కుంభా వీరమ్మ, నాయకులు కుంభా శ్రీను, కుంభా గోవిందు పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాలు అరికట్టాలి

డీఎంహెచ్ఓ శోభారాణి

నరసరావుపేట: జిల్లాలో మాతృ, శిశు మరణాలు అరికట్టేందుకు వైద్యాధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి ఆదేశించారు. పల్నాడు రోడ్డులోని జిల్లా కార్యాలయంలో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గత నెలలో చోటుచేసుకున్న మాతా, శిశు మరణాలపై ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఏర్పాటు చేయబడిన ఉచిత, అల్ట్రా సోనోగ్రఫీ, టిఫ పరీక్షలను చేయించుకునే విధంగా గర్భిణులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, జిల్లా మాతృసంరక్షణ అధికారి డాక్టర్ నాగపద్మజ, డాక్టర్ హనుమకుమార్, డాక్టర్ మంత్రు నాయక్, డాక్టర్ రాంబాబు, చిన్న పిల్లలు వైద్యులు డాక్టర్ లక్ష్మణరావు, రొంపిచర్ల, ఆరేపల్లి ముప్పాళ్ళ, ఏనుగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏసీఏ అండర్-19 సెంట్రల్ జోన్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ నుంచి జూలై 14 వరకు అండర్-19 ఆంధ్రా సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు పెదచెరువులోని ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు బుధవారం తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు పర్యవేక్షణలో గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల జట్లు పోటీలో పాల్గొంటాయని చెప్పారు. పోటీలలో భాగంగా 29వ తేదీ నుంచి మొదటి మూడు రోజులు 50 ఓవర్ల వన్‌డే మ్యాచ్‌లు, జూలై 3 నుంచి 14వ తేదీ వరకు టెస్ట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీల నుంచి ప్రతిభ చూపిన క్రీడాకారులను సెంట్రల్ జోన్ టీమ్‌కు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన టీమ్ రాష్ట్ర స్థాయి పోటీలలో అన్ని జోన్‌ల టీమ్‌లతో పోటీ పడుతుందన్నారు. ఆ పోటీలో ఎంపికైన రాష్ట్ర జట్టు విజయ్ హజారే ట్రోఫీ టోర్నమెంట్‌లో పాల్గొంటుందని తెలిపారు.

మంత్రులు రజిని, అంబటి బక్రీద్ శుభాకాంక్షలు

చిలకలూరిపేట: ప్రేమ, త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తోందని, ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆకాంక్షించారు. సర్వమానవ సౌభ్రాతత్వాన్ని పండుగ అద్దం పడుతుందన్నారు. పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. వేరొక ప్రకటనలో మంత్రి అంబటి రాంబాబు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు అందజేశారు. త్యాగాలను స్మరించుకోవాలని చెప్పారు. ఐక్యంగా పండుగ చేసుకోవాలని కోరారు.

పేదవాడి ఇంటివద్దకే కార్పొరేట్ వైద్యం

- పల్నాడు జిల్లా వైద్యాధికారి శోభారాణి
- సాతులూరులోని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం సందర్శన



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న శోభారాణి

నాదెండ్ల(యడ్లపాడు): పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే ప్రక్రియలో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను అమలు చేస్తున్నట్లు పల్నాడు జిల్లా వైద్యాధికారి కె.శోభారాణి చెప్పారు. నాదెండ్ల మండలం సాతులూరు హెల్త్ సబ్‌సెంటర్-1 ఆమె బుధవారం సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నేరుగా లబ్ధిదారులను ఈ విధానంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. శోభారాణి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు ఇంటివద్దనే అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను దేశంలోనే వినూత్నంగా ప్రవేశపెట్టిందన్నారు. స్థానిక వైద్యాధికారి సాయికృష్ణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగరాజిత, డీఈఓ పవన్‌కుమార్‌రెడ్డి, ఏఎన్ఎం జోజమ్మ పాల్గొన్నారు.

అటవీ శాఖ సిబ్బందిపై దాడి

పోలీసులకు ఫిర్యాదు



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్వో మురళి

దాచేపల్లి: మండలంలోని శంకరపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అటవీ శాఖ సిబ్బందిని మంగళవారం అర్ధరాత్రి స్థానికులు అడ్డగించి దాడికి పాల్పడ్డారు. శంకరపురం సమీపంలోని కొండపై రంగురాళ్లను తవ్వి ఆటోలో తరలిస్తున్నట్లుగా సిబ్బందికి సమాచారం అందింది. దీంతో బీట్ అధికారి రాయపాటి రాకేష్, స్థానికుడు వట్టెపు క్రాంతికుమార్‌తో కలసి శంకరపురం సమీపంలో గాలింపు చేపట్టారు. ఆటోను గుర్తించిన సిబ్బంది దాన్ని ఆపేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డగించారు. ఇతర మార్గంలో తరలించారు. అటవీ శాఖ సిబ్బందితో వాగ్వివాదానికి దిగి, బీట్ అధికారి రాకేష్‌ను నెట్టివేశారు. క్రాంతికుమార్‌పై దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న డీఆర్వో కె. మురళి సిబ్బందితో మాట్లాడారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు బుధవారం వచ్చి సీఐ ఎ. సురేంద్రబాబును కలసి ఘటనపై ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వ్యక్తుల్ని గుర్తించేందుకు శంకరపురం అటవీ సిబ్బందితో వెళ్లి పోలీసులు విచారణ చేపట్టారు. రంగురాళ్ల తవ్వకాలు జరగకుండా అడ్డుకుంటున్న తమ సిబ్బందిపై దాడులు చేస్తున్నారని, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఆర్వో మురళి చెప్పారు.

గంజాయి కేసులో ఆరుగురు అరెస్టు

- 14 కేజీల గంజాయి, కారు స్వాధీనం
- జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి వెల్లడి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, పక్కన సీఐ వీరేంద్రబాబు

నరసరావుపేట: గంజాయి కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసి, 14 కిలోల గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కె.వి.మహేష్ పర్యవేక్షణలో టుటౌన్ సీఐ పి.వీరేంద్రబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ రహమతుల్లా బృందం గంజాయి రవాణా, వినియోగం గురించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారన్నారు. ఈ డ్రైవ్‌లో కొంతమంది వ్యక్తులు పట్టణంలోని గుంటూరు రోడ్డులో గంజాయిని కలిగి ఉన్నారన్న సమాచారంతో దాడి చేసినట్లు చెప్పారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని, వీరి వద్ద నుంచి రూ.1.40 లక్షల విలువైన 14 కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన ముత్తుపాటి అమర్, చిలకలూరిపేట మండలం కోమటినేనివారిపాలేనికి చెందిన చిన్న కోటేశ్వరరావు, యడ్లపాడు మండలం తిమ్మాపురానికి చెందిన జంగా నరేంద్ర, వాసిమల్ల జాషువా దానియేల్ చెడు వ్యసనాలకు అలవాటుపడి సులభమార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని అమ్మి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారన్నారు. అందుకు గాను విశాఖపట్నానికి చెందిన నెమలి వీరబాబు, వాంకడావత్ బాలాజీల వద్ద నుంచి గంజాయిని తక్కువ ధరకు కొని అధిక ధరకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేయటం ప్రారంభించారన్నారు. ఈ క్రమంలో నెమలి వీరబాబు, వాంకడావత్ బాలాజీ టాటా ఇండిగో కారులో విశాఖపట్టణం నుంచి నరసరావుపేటకు గంజాయి తీసుకొచ్చి, గుంటూరు రోడ్డులోపై నలుగురికి గంజాయిని అమ్ముతుండగా దాడిచేసి అందరినీ అరెస్టు చేయటం జరిగిందన్నారు. వీరందరినీ కోర్టు ముందు హాజరుపర్చనున్నట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ వీరేంద్రబాబు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పోలీసులు స్పెషల్ డ్రైవ్



రైల్వే బుకింగ్ కౌంటరు వద్ద సోదాలు

తెనాలిరూరల్: అర్ధరాత్రి వేళ రైళ్ల కోసం వేచి చూస్తున్న ప్రయాణికుల నిద్రమత్తును ఖాకీల బూట్ల చప్పుడు వదిలించింది. పెద్ద సంఖ్యలో పోలీసులు సోదాలు నిర్వహించడంతో ఏం జరిగిందో అర్థంకాక ఆందోళనకు గురయ్యారు. సోదాల్లో ఎప్పుడూ చూడనంత మంది పోలీసులు రావడం ప్రయాణికులను ఉలికిపాటుకు గురి చేసింది. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సివిల్, రైల్వే పోలీసులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి పెద్ద సంఖ్యలో వచ్చిన పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో అనుమానితులను ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పని, సరైన కారణం లేకుండా రోడ్లపైకి వచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రైల్వే స్టేషన్‌కి వెళ్లారు. స్టేషన్ ప్రాంగణం, బుకింగ్ కౌంటర్ ఏరియాతో పాటు అన్ని ప్లాట్‌ఫాంలలో సోదాలు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న ప్రయాణికుల లగేజీని తనిఖీ చేశారు. కొందరు ప్రయాణికుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఎక్కడ నుంచి వచ్చింది, ఎక్కడికి వెళుతోందన్న వివరాలను రికార్డు చేశారు. తెనాలి త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్ బాబు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీ బేగ్, ఏఎస్ఐ శివ రామకృష్ణయ్య, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ ఎల్.సరస్వతి ఉన్నారు.

తొలి ఏకాదశి తిరునాళ్లకు సర్వం సిద్ధం



కొండపైన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం రామలింగేశ్వరస్వామి ఆలయ తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దగ్గరుండి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్న తిరునాళ్ల మహోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొని స్వామి వారి దీవెనలు పొందాలన్నారు. అదే విధంగా శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో కొండపై రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ప్రత్యేక పూజలు, అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమానికి సంబంధించి జ్యోతి శుద్ధి, భూమిశుద్ధి, సంకల్ప శుద్ధి కార్యక్రమాలను హిమాలయ గురూజీచే నిర్వహించారు.

కొండపైకి బస్సు ట్రయల్ రన్ విజయవంతం

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తొలిసారిగా కొండపైకి ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీర్‌లతో కలిసి బస్సును విజయవంతంగా కొండపైకి ట్రయల్‌రన్ వేశారు. తిరునాళ్లకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో 30 ఆర్టీసీ బస్సులను భక్తుల సౌకర్యార్థం కొండ కింద నుంచి దేవాలయం వద్దకు నడుపుతున్నారు. ఎమ్మెల్యే బస్సులో ప్రయాణించారు.